కథానిక:

మనస్తత్వం

శ్రీ ఈరంకి వెంకటరావు

ప్రభాకరానికి శివరామయ్య బజారులో ఇరవై గజాల దూరంలో ఉండగానే కనిపించాడు. ప్రభాకరం అప్పుడే కోర్టునుంచి వస్తున్నాడు. ఎవరో పార్టీలు కూడా కూడా ఉన్నారు. ప్రభాకరం శివరామయ్యను ఎట్లాగైనా తప్పించుకొని వెళ్ళిపోదామనుకొన్నాడు. శివరామయ్య ప్రభాకరం ఉద్దేశం అతని ముఖచర్యలవల్ల, అడుగుల తడబాటువల్ల గ్రహించకపోలేదు. ప్రభాకరాన్ని పలకరించకుండా పోనిచ్చే ఉద్దేశ్యం శివరామయ్యకు లేదు.

ప్రభాకరం శివరామయ్యకు ఎంత ఎడంగా ఉండాలని చూస్తున్నాడో, శివరామయ్యకు ప్రభాకరానికి అంత సన్నిహితంగా వుండాలనీ వుంది. ప్రభాకరం మనసు విరుచుకోవాలని చూస్తున్నాడే గాని, శివరామయ్యకుమాత్రం ప్రభాకరంమీద మమకారంపోవటంలేదు. అవి పోయేది గాదు. ఎందువల్లనంటే ఎంత ఇదయినా ప్రభాకరం శివరామయ్య కన్న కొడుకు. అందులోనూ అతని కొడుకులందరిలోనూ ప్రభాకరమే వృద్ధిలోకొచ్చాడు. కాకపోతే శివరామయ్య చేసిన మహాఘోరనేర మేమంటే— ప్రభాకరాన్ని తన తోడల్లుడికి దత్తత ఇవ్వటమే. అట్లా దత్తత ఇవ్వబట్టే ప్రభాకరం చాలా వృద్ధిలోకి వచ్చాడు. ప్లీడరీ చేస్తున్నాడు. రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. మరి శివరామయ్యదగ్గర ఉన్న కొడుకు లెవరూ ఇంటర్మీడియేట్ క్లాసు దాటలేదు.

తండ్రీ కొడుకు లిద్దరూ దగ్గరగా వచ్చారు. ఎంతో ఆప్యాయంగా కళ్లల్లో ఆనందంతొణికిస్తూ అడిగాడు:

"కోర్టునుంచి వస్తున్నావా అబ్బాయి?" అని.

శివరామయ్యకు తెలుసు అతను కోర్టునుంచే వస్తున్నాడని. కాని అతను ఆ సమయంలో అంతకంటే ఏం ప్రశ్నచేయగలడు? ప్రభాకరం మొగం కర్కశంగాపెట్టుకుని "అవును" అని చెప్పి త్వరత్వరగా నాలుగడుగులు వేసి, ఎవరో బాకీదారుణ్ణి తప్పించుకున్నట్టు తన తండ్రిని తప్పించుకున్నాడు.

*   *   *   *

పాతిక సంవత్సరాల క్రిందట.........

శివరామయ్య తన నాలుగో కొడుకుని దత్తత ఇచ్చేముందే చాలా ఆలోచించాడు. ఇంట్లో అందరూ మూడోవాణ్ణి ఇమ్మని చాలా పోరు పెట్టారు. కాని ఏమిటో అప్పట్లో శివరామయ్య బుద్ధి అలా నడిచిందిగాదు. ఏం చేస్తాం ఇప్పుడెంత అనుకుంటేమాత్రం లాభమేముంది. నాలుగోవాణ్ణి దత్తత ఇచ్చేటప్పటికి మూడోవాడు విశ్వం సెకండుఫారము చదువుతున్నాడు. అప్పటికే విశ్వం మేష్టరు లందరూ వాడు చాలా తెలివైనవాడనీ, చాలా వృద్ధిలోకి వస్తాడనీ అంచనాకట్టి చెబుతూండేవారు. అందుకని శివరామయ్యకి విశ్వాన్ని ఇవ్వటం ఇష్టం లేకపోయింది.

కాని ఇంట్లోవాళ్ళందరికీ ప్రభాకరాన్ని చూస్తే చాలా ముద్దు. వాడివయస్సు అప్పటికి ఆరు సంవత్సరాలే. ఆరుసంవత్సరాల వయస్సున్న ప్రభాకరం తెలివితేటలకీ, ఆరుసంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు విశ్వానికుండే తెలివితేటలకీ, చురుకుదనానికీ తైపారువేసిచూస్తే ప్రభాకరమే తెలివైనవాడని చెప్పాలి. వాడికి జ్ఞాపకశక్తికూడా చాలా హెచ్చు. అయితే ఈ విషయాల్ని శివరామయ్య ఇంట్లోవాళ్ళు కనిపెట్టినట్టుగా శివరామయ్య కనిపెట్టలేకపోయాడు. దానికి స్కూలు మేష్టర్లు చెప్పినమాటలమీదే గురి.

విశ్వాన్ని తప్పించి ప్రభాకరాన్ని దత్తత యివ్వడానికి మరో కారణంకూడా వుంది. వాణ్ణి విశ్వానికప్పుడే పన్నెండేళ్లువచ్చాయి. దత్తత యిస్తే ఆ కొత్తయింట్లో వాడు లేని అభిమానం తెచ్చుకుని కొత్తగా "అమ్మా, నాన్నా" అని పిలవటం చాలా కష్టం. ఆ కొత్తఇంట్లో ఉండటమూ కష్టమే. ప్రభాకరమయితే యింకా కుర్రాడు వాడు ఇట్టే అతికిపోగలడు — వాణ్ణి ఆకర్షించుకునే విధంగా ఆకర్షించుకుంటే.

ఈ కారణంవల్లే శివరామయ్య తనకు తోచినట్టుగా దత్తత సాగించగలిగాడు. అదత్తతైనా ఎవరో పైవాళ్లకు ఇవ్వలేదు. తనతోడల్లుడికే ఇచ్చాడు. ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలేగాని మగవాళ్ళు లేరు. ఆయన శివరామయ్య కొడుకుల్లో విశ్వాన్నిగాని, ప్రభాకరానిగాని తనకు దత్తతగా ఇమ్మని అడిగాడు. శివరామయ్య ప్రభాకరాన్నే ఇచ్చాడు.

శివరామయ్య యీ దత్తత జరిపి ఇప్పటికప్పుడే పాతిక సంవత్సరాలైంది. శివరామయ్య కొడుకను దత్తత ఇచ్చేముందు ఎంత ఆలోచించాడో, అది జరిగాక, దాని ఫలితాన్ని చూసి



ఇప్పుడు అంతకు పదిరెట్లు విచారిస్తున్నాడు. విశ్వం తెలివితేటలూ, చురుకుదనమూ ఇంటర్మీడియేటుతరగతి ప్యాసుకాకుండానే అగిపోయాయి. వాడికిప్పుడు పెద్ద గర్వం—తను స్కూలుఫైనల్ ప్యాసయినానుగదా అని. మరి ఆ గర్వాంధకారంలో పడి వాడిప్పటికీ లేవలేకపోతున్నాడు. ఆ యింటర్మీడియేటులో అనేక దండయాత్రలు సాగించి ఇంక మానుకుని ఒక గుమాస్తాగిరీలో పాతుకు పోయాడు. అతనికి పెళ్ళయింది; పిల్లలున్నారు; ఏదో జీవితం ఒక మాదిరిగా వెళ్లిపోతూంది.

ప్రభాకరం పని విశ్వంకన్నా, ఇంక అతనికంటె పెద్దవాళ్ళైన ఇద్దరు అన్నల స్థితికన్నా బాగుంది. అతనికి ధనానికి లోటులేదు. విద్యకీ లోటులేదు. చిన్నక్లాసులో చిన్నప్పుడు కొస్త బండగా మొండిగా వున్నవాడికి పెద్దక్లాసుల్లోకొచ్చేటప్పటికి ఎక్కడలేని చురుకుదనమూ వచ్చింది. తెలివైన వాడని పదిమందిచేతా అనిపించుకుంటున్నాడు. ఇప్పుడు ప్రభాకరం ప్లీడరీ ప్యాసయి రెండుచేతులా ఆర్జిస్తున్నాడు. శివరామయ్య కదేమనో వేదనగావుంది తను ఇదివరకు చేసినది ఘోరమైనతప్పుగా ఎంచుకుంటున్నాడు. ప్రభాకరమేగనక దత్తతకు వెళ్లకుండా వుంటే తన యింటికెంత, పేరు ఎంత ధనం? అనుకుంటున్నాడు.

అయితే యీ విషయమే గాకుండా ఇంకా శివరామయ్యకి మనోవేదన కలిగించే మరోవిషయముంది. దత్తత ఇచ్చినా ప్రభాకరం అంటే శివరామయ్యకి ఎంతో ప్రేమ, అభిమానం, గౌరవం కూడాను తను కన్నకొడుకుని చూసి గర్వించుతూ ఉంటాడు. వాడి విద్య, డబ్బు చూసి శివరామయ్య మురిసిపోతూ ఉంటాడు. కాని, ప్రభాకరం శివరామయ్యను ఎవరో పరాయివాణ్ణి చూసినట్టు చూస్తాడు ఎప్పుడైనా పలకరించవలసివచ్చినప్పుడు "ఏం బాబాయి" అనిగాని "ఏంనాన్నా" అనిగాని అనడు. "ఏమండీ శివరామయ్యగారూ" అంటాడు. అతను అలా పిలిచినప్పుడు శివరామయ్య మనస్సు కలుక్కుమంటుంది. అతను చాలా బాధపడతాడు అంతే, ఇంకేం చెయ్యగలడు? "అబ్బాయి, అలా అనకూడదు నాయనా, ఇలా అనాలి" అని అతను ఎన్నోసార్లు చెబుదామనుకున్నాడు. కాని చెప్పలేక పోయేవాడు. తను అలాగ చెబితే ప్రభాకరం మనస్సు ఎక్కడ బాధపడుతుందో అని చెప్పటం మానివేశాడు. తన సన్నిహితులచేత రెండు, మూడుసార్లు వాళ్ళంతటవాళ్ళు చెప్పినట్టుగానే తనని "నాన్నా" అనిగాని, "బాబాయి" అనిగాని పిలవాలని ప్రభాకరానికి చెప్పి చూపించాడు. కాని ప్రభాకరం ఎప్పుడైనా మాట్లాడవలసివస్తే "ఏమండీ శివరామయ్యగారూ!" అనే సంబోధించేవాడు.

ప్రభాకరానిదదో విధమైన మనస్తత్వం. అతన్ని దత్తత ఇవ్వటం మూలాన్ని అతనికి కన్నవారింటిమీద సరియైన ప్రేమలేదు, పెంచుకున్నవారిమీదా సరియైన అభిమానం లేదు. తనని పెంచుకున్నవారు వారి వంశం నిలబడ్డంకోసం, వారికి అంత్యక్రియలు, ఉత్తరక్రియలు సవ్యంగా జరగటంకోసం పెంచుకున్నారు. అది వారి స్వార్థమే, అంతేగాని తనమీద ప్రత్యేకాభిలాషగాని, ప్రేమగాని వుండిగాదు. అందుకనే అతను వాళ్ళ డబ్బును మాత్రమే ప్రేమించగలిగాడుగాని, వాళ్ళను మాత్రం ప్రేమించలేకపోయాడు. ఇప్పుడు సంపాదిస్తున్నదంతా వాళ్ళ చేతులో పోసి వాళ్ళ ఋణాన్ని యీ జన్మలోనే తీర్చుకుంటున్నాడు.

ఇక కన్నతండ్రి విషయంలో—తనని పెంచలేని, పోషించలేనివాడు తన సెందుకు యీ ప్రపంచంలోకి యీడ్చుకు రావాలి? అష్టకష్టాలు పడి కని, కొంతకాలం పెంచిన వాళ్ళే తన మీద మమకారం చంపుకుని చేజేతులా దూరం చేసుకుంటే, తానెందుకు పాకులాడి వాళ్ళమీద ప్రేమ పెంచుకోవాలి? ఈనాడు తాను బాగా వృద్ధిలోకి వచ్చాడుగాబట్టి అందరూ తనని గౌరవించి, ఆత్మీయుడుగా భావించి దగ్గర చేరుతున్నారుగాని, ఒకనాడు తాను వాళ్ళందరికీ అక్కరలేక పోయినవాడేగా?

నిజంగా యీ ప్రశ్నలకు ప్రభాకరానికి ఎవరూ సమాధానం చెప్పలేరు అయితే అతను యీ ప్రశ్నలను ఇంతవరకూ ఎవరినీ అడగలేదు. అతని నడవడిమాత్రం యీ ప్రశ్నలకు సంబంధించిన సూత్రాలమీదే ఆధారపడివుంది. అందుకనే అతని మనస్తత్వం ఎవరికీ అర్థంగాదు.

శివరామయ్య ప్రభాకరం నడవడి చూసి పడే బాధ అతనికేగాని, మరెవ్వరికీ తెలియదు. శివరామయ్య ఎవళ్ళతోనైనా యిలాగనేవాడు: "మా ప్రభాకరానికి నన్ను నాన్నా అనిగాని, బాబాయ్ అనిగాని పిలవటానికి చాలా చిన్నతనంగా వుంది గాబోలు. నన్ను ఎవరో పరాయివాణ్ణి చూసినట్టు చూస్తున్నాడు. పోనీలెండి. వాడు నన్నెలా పిలిచినా వాడు నా కొడుకే. వాడి అభివృద్ధి, ఐశ్వర్యమే నేను కోరేది. వాడికి నేను జీవితంలోకల్లా ఒకటే అపకారం చేశాను. అది వాణ్ణి దత్తత ఇవ్వటం. నేను అది వాడి బాగు కోసం చేశానుగాని, నాకోసం చెయ్యలేదు. అది వాడు గుర్తించినట్టులేదు. నన్ను పరాయివాణ్ణి చూసినట్టు చూస్తున్నాడు. నా కంఠంలో జీవం ఎగిరి పోయేలోగా వాడి నోటితో నన్ను "నాన్నా" అని ఒక్కసారి పిలిస్తే వినాలని వుంది. అదే నా కనీసపుకోర్కె. నేను దానికైనా నోచుకున్నానో, లేదో" అనేవాడు.

ఈ మాటలు శివయ్య నోటినుంచి వింటూవుంటే ఎవడికైనా జాలి పుట్టకమానదు. హృదయం ద్రవించి పోతుంది. కాని విచిత్రప్రవృత్తిగల ప్రభాకరాన్ని మాత్రం యీ మాటలు మార్చలేవేమో ననిపిస్తుంది.

కేసరికుటీరం లిమిటెడ్ మద్రాస్
ఒరిస్సా, నైజాముదొమినియన్సు, ఆంధ్రజిల్లాలు, తమిళనాడులకు ఏజెంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు,
బరంపురం, సికింద్రాబాదు, బెజవాడ, మదుర.
(Jai Hind Publicities)